## మహిళా ఎమ్మెల్యేపై చేతులు వేసిన బీజేపీ ఎంపీ

అలీగఢ్: ఒక ప్రభుత్వ కార్యక్రమంలో తోటి మహిళా ఎమ్మెల్యే భుజంపై చేతులేసి అనుచితంగా ప్రవర్తించాడో బీజేపీ ఎంపీ. యూపీలో అలీగఢ్‌లోని కోల్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ సతీష్ గౌతమ్ పక్కనే ఉన్న మహిళా ఎమ్మెల్యే భుజాలపై చేతులు వేసారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి గురైన ఆమె తన సీటును స్టేజిపై మరోచోటుకు మార్చుకున్నారు. ఈ దృశ్యం వీడియోలో రికార్డు కావడం, అది వైరల్ అవ్వడంతో బీజేపీ ఎంపీ చర్యను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు.

## యూపీలో ఆస్కార్ విజేత ఇంటి కూల్చివేతకు నోటీసులు

లక్నో, సెప్టెంబర్ 30: ఆస్కార్ అవార్డు గ్రహీత పింకీ సోంకర్ ఇంటి కూల్చివేతకు ఉత్తరప్రదేశ్ అటవీ అధికారులు నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్ల నిర్మాణం చేశారని ఆమెతోపాటు కొందరికి నోటీసులు అందజేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌కు చెందిన పింకీ సోంకర్ చీలిక పెదవితో(గ్రహణం మొర్రి) జన్మించారు. తన జీవితం ఆధారంగా తీసిన 'స్మైల్ పింకీ' డాక్యుమెంటరీకి 2008లో ఆస్కార్ అవార్డు లభించింది. పింకీ తన కుటుంబ సభ్యులతో కలిసి రాంపూర్ దాభి గ్రామంలో నివాసముంటున్నారు. మరో 30 మందికి అటవీ శాఖ అధికారుల నుంచి నోటీసులు అందాయి.

## ఆ జడ్జి వెనుక ఉన్న అభయ హస్తం ఎవరిది?

### కలకత్తా హైకోర్టు ఘాటు వ్యాఖ్య

కోల్‌కతా: టీచర్ల నియామక కుంభకోణానికి సంబంధించి సీబీఐ కోర్టు జడ్జి అర్పణ్ ఛటోపాధ్యాయకు కలకత్తా హైకోర్టు చురుకలు వేసింది. ఆ కేసుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో అతడిని బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు ఇంకా అమలు కాకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 'సీబీఐ జడ్జికి అండగా ఎవరి హస్తం ఉంది?' అని హైకోర్టు జడ్జి అభిజిత్ న్యాయవాదుల బార్, బెంచ్‌ని ప్రశ్నించారు. బదిలీ ఫైల్ మీ శాఖ వద్దే ఉన్నా ఎందుకు ఉత్తర్వులివ్వ లేదో వివరించాలని బెంగాల్ న్యాయ శాఖ మంత్రి మలయ్‌కు సమన్లు జారీ చేశారు. అక్టోబర్ 4 లోగా సీబీఐ జడ్జిని బదిలీ చేయాలని, టీచర్ల కుంభకోణం కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులపై ఎలాంటి ఫిర్యాదులను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

## నితీశ్ కాన్వాయ్ కోసం గంట ఆగిన అంబులెన్స్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కాన్వాయ్ ప్రయాణించేందుకు వీలుగా వాహనాలను నిలిపేయడంతో ఓ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. పాట్నాకు సమీపంలోని ఫటుహా వద్ద నలంద ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రారంభించిన అనంతరం నితీశ్ తిరిగి పాట్నా వెళ్తున్నపుడు ఫట్వా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ప్రాణాల కోసం పోరాడుతున్న చిన్నారిని చికిత్స కోసం పాట్నాలోని దవాఖానకు తరలిస్తున్న అంబులెన్స్‌ను కూడా పోలీసులు నిలిపేశారు. దీంతో ఆ బాలుని తల్లి తీవ్రంగా విలపించడం కనిపించింది. దాదాపు గంట సేపు అంబులెన్స్ కదలకపోవడంతో ఆ బాలుడు స్పృహ లేని స్థితికి వెళ్లాడు. అంబులెన్స్ డ్రైవర్ ధనంజయ్ కుమార్ మాట్లాడుతూ, సీఎం వస్తున్నందువల్ల వాహనాలను నిలిపేశారని, అత్యవసర చికిత్స కోసం బాలుడిని పాట్నాలోని దవాఖానకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

## సిక్కుల ప్రార్థనతో అమెరికా చట్టసభ ప్రారంభం

న్యూఢిల్లీ: చరిత్రలో మొదటిసారిగా అమెరికా ప్రజాప్రతినిధుల సభను సిక్కు ప్రార్థనలతో ప్రారంభించారు. శుక్రవారం సభా కార్యక్రమాల నిర్వహణకు ముందు తొలుత సిక్కులు ప్రార్థన చేశారు. యూఎస్ కాంగ్రెస్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా సమావేశాన్ని సిక్కు ప్రార్థనతో ప్రారంభిస్తున్నామని, ఇది మనకే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సిక్కులందరికీ సంతోషకరమైన సందర్భమని ప్రార్థనలు నిర్వహించిన జ్ఞాని జస్వీందర్ సింగ్ తెలిపారు. అనంతరం సిక్కు సమన్వయ కమిటీ ప్రతినిధి హర్జీందర్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, సౌభాగ్యాలకు కృషి చేస్తున్న పార్లమెంట్ సభ్యుల కోసం ఆశీర్వాదాలు కోరినట్టు చెప్పారు.

# అంతా భ్రాంతియేనా?

*'ప్రతీ ఒక్క భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షల చొప్పున జమచేస్తాం' అంటూ 2014 ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్భాటంగా ప్రకటించారు.*
*అయితే, అలా జరుగలేదు. దీనిపై ఓ ఇంటర్వ్యూలో హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ''వో తో చునావీ జుమ్లా థా' (ఎన్నికల ప్రచారంలో అదో ఫీట్)' అని తేల్చిపారేశారు.*

*ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా బీజేపీ మరో 'చునావీ జుమ్లా'నేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.*

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించగానే '35 ఏండ్ల నిరీక్షణకు శుభం కార్డు పడింది. ప్రజాస్వామ్యంలో భారత నవనారీ శకం మొదలైంది' అని అందరూ సంబురపడిపోయారు. అయితే, 2026లో జనగణన, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టిన తర్వాతే మహిళా రిజర్వేషన్ల బిల్లు అమల్లోకి వస్తుందని, ఈ మేరకు అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ ముఖ్యమని కేంద్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఎప్పుడో మూడేండ్ల తర్వాత అమల్లోకి వచ్చే మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ సర్కారు ఇప్పుడు ఎందుకు అంత ఆర్భాటానికి పోతున్నదన్న ప్రశ్నలు మొదలవుతున్నాయి.

రానున్న ఎన్నికల్లో లబ్ధి కోసమే 'మహిళా బిల్లు'ను ఓ అస్త్రంగా ఆ పార్టీ వాడుకొంటున్నదని, ఎన్నికల తర్వాత ఆ బిల్లు మరుగున పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గతంలో పార్లమెంట్‌లో ఆమోదం పొందినా, ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమల్లోకి రాని పలు చట్టాలను ఉదహరిస్తున్నారు.

**ఏడుసార్లు గడువు మార్చుకొన్న సీఏఏ**

2014 డిసెంబర్ 31 లేదా అంతకుముందు దేశంలోకి వలసవచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, క్రిస్టియన్, జైన్, పార్సీ మతాల వారికి పౌరసత్వాన్ని మంజూరు చేసే ఉద్దేశంతో 2019లో కేంద్రం పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను తీసుకొచ్చింది. డిసెంబర్ 2019లో పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదముద్ర వేశాయి. జనవరి 10, 2020 నుంచి చట్టం అమల్లోకి వచ్చినట్టు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే, సీఏఏలోని కొన్ని క్లాజులు కొన్ని వర్గాలపై వివక్షాపూరితంగా ఉన్నాయంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను సరిగ్గా ఇవ్వని కేంద్రం.. చట్టంలో నిబంధనలను సవరిస్తామని ఇప్పటివరకూ ఏడుసార్లు గడువును పొడిగించింది. దీంతో ఈ చట్టానికి రాజముద్ర పడినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

**మూలనపడ్డ ఎన్నార్సీ, ఎన్పీఆర్**

అసలైన భారత పౌరులెవరో, అక్రమ వలసదారులెవరో గుర్తించేందుకు 2019లో కేంద్రం జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)ని తీసుకొచ్చింది. 1971, మార్చి 24 తర్వాత బంగ్లాదేశ్ నుంచి వచ్చి, రికార్డుల్లో నమోదుకాని వలసదారుల సంఖ్యను గుర్తించే కసరత్తు ఇది. ఇప్పటికీ ఇది అమల్లోకి రాలేదు. ఇక, జనగణనకు కాపీగా 2019లోనే తీసుకొచ్చి విమర్శలపాలైన జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్) అమలు ఇప్పటివరకు ఐదుసార్లు వాయిదా పడింది.

**వీటి పరిస్థితి కూడా ఇంతే..**

2014 నుంచి ఇప్పటివరకూ 40కి పైగా బిల్లులు పార్లమెంట్ ఉభయసభల ముందు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో 12 బిల్లులకు లోక్‌సభ, మరో 10 బిల్లులకు రాజ్యసభ, మరో 3-4 బిల్లులకు ఉభయసభల ఆమోదం లభించినప్పటికీ, ఇప్పటివరకూ ఆ చట్టాలు పూర్తిస్థాయిలో అమల్లోకి మాత్రం రాలేదు.

### మహిళా రిజర్వేషన్లపై ఇప్పటికీ అనుమానాలే

- ఎన్నికల్లో లబ్ధికే బిల్లులతో కేంద్రం హడావుడి
- అమల్లోకి వచ్చేది మాత్రం ఎప్పుడో
- 2027 వరకూ మహిళా చట్టం అమలు కష్టమే
- ఏడుసార్లు గడువు మార్చుకొన్న సీఏఏ
- ఇప్పటికీ అమల్లోకి రాని బిల్లులు ఎన్నో



### బిల్లులే కాదు నినాదాలు కూడా..

రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా ఎన్నికల సమయంలో బిల్లులే కాదు పలు నినాదాలను ఇవ్వడం ఆ తర్వాత వాటిని పక్కనబెట్టడం బీజేపీకి అలవాటే. 2014 ఎన్నికల్లో 'అచ్చేదిన్' నినాదమిచ్చిన ప్రధాని మోదీ ఐదేండ్లు తిరిగే నాటికి దాన్ని పక్కనబెట్టేశారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో 'న్యూ ఇండియా-2022' అంటూ మరో నినాదాన్ని ఎత్తుకొన్నారు. 2021లో దాన్నీ వదిలేసి '2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక' వ్యవస్థ అంటూ మొదలుపెట్టారు. ఇప్పుడు 2047 నాటికి పంచ ప్రాణాల ఆవిష్కరణ అంటూ వజ్రోత్సవ సంబురాల్లో కొత్త ప్రకటన చేశారు. అయితే, ఇప్పటివరకూ ఏ ఒక్కటీ సాకారం కాలేదు. సాక్షాత్తూ ప్రధాని ప్రకటించిన 100 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదు.

## మహిళా రిజర్వేషన్లు ఇప్పట్లో అమలు కావు: చిదంబరం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది ఒక భ్రమ అని, నీటిలో కనిపించే జాబిల్లి వంటిదని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం పేర్కొన్నారు. రిజర్వేషన్ల చట్టం కొన్నేండ్ల పాటు అమల్లోకి రాదని అన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్టుగా మహిళా బిల్లు చట్టంగా మారొచ్చేమో కానీ, వాస్తవంలోకి రావడానికి చాలా ఏండ్ల పడుతుందని అన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందు రిజర్వేషన్లను అమలు చేయనప్పుడు, ఈ చట్టం ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇది ఒక ఎన్నికల జుమ్లా మాత్రమేనని చిదంబరం ఎక్స్ వేదికగా మోదీ సర్కార్‌ను విమర్శలు గుప్పించారు. ఎలక్టోరల్ బాండ్లను 'చట్టబద్ధమైన లంచం'గా చిదంబరం మరో పోస్టులో అభివర్ణించారు. ఎలక్టోరల్ బాండ్లు బీజేపీకి బంగారు పంట అయిందని, దాదాపు 90 శాతం ఆ పార్టీకి వెళ్తున్నాయని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు ఢిల్లీలోని తమ దేవుడు, మాస్టర్‌కు చెక్కులు రాసి ఇచ్చేస్తున్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి చిదంబరం అన్నారు. కాగా, మరోవైపు మహిళా రిజర్వేషన్లపై ఆర్జేడీ నేత అబ్దుల్ సిద్దిఖీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లోని ముజఫర్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల పేరుతో లిప్‌స్టిక్‌లు, బాండ్ కట్ హెయిర్‌స్టైల్స్ ఉన్నవారే ముందుకొస్తారని అన్నారు. వెనుకబడిన వర్గాల మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.

వాషింగ్టన్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల్లో యోగా చేస్తున్న శ్రీశ్రీ రవిశంకర్

## మనందరిదీ ఒకే కుటుంబం

### శ్రీశ్రీ రవిశంకర్

వాషింగ్టన్: ఈ భూమి అత్యంత వైవిధ్యంతో కూడినదని, అయితే మానవీయ విలువలు మనందరినీ ఏకం చేస్తున్నాయని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్ చెప్పారు. మనలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైనవారే అయినప్పటికీ, అందరూ ఒకటేనని గుర్తించగలిగే జ్ఞానం మనందరికీ ఉందని తెలిపారు. మన జీవితాలను పండుగలా గడుపుదామని, సవాళ్లను స్వీకరించి, ధైర్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. మన కోసం, రాబోయే తరాల కోసం మరింత మెరుగైన భవిష్యత్తును ఆశిద్దామని చెప్పారు. వాషింగ్టన్ డీసీలోని నేషనల్ మాల్‌లో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో జరుగుతున్న నాలుగో ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాల తొలి రోజున జరిగిన కార్యక్రమాలను ప్రత్యక్షంగా దాదాపు 10 లక్షల మంది వీక్షించినట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రకటించింది. ఈ ఉత్సవాల్లో 180 దేశాల ప్రముఖ కళాకారులు పాల్గొన్నట్లు తెలిపింది. ప్రపంచంలోని విభిన్న సంస్కృతుల సమాహారంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. మానవాళిని మానవత్వం, శాంతి సందేశాలతో ఏకం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించింది. ఆచార్య లోకేశ్ ముని, ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్, వాషింగ్టన్ డీసీ నగర మేయర్ మురియెల్ బౌసర్, భారత విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

**భారతీయ అధ్యాత్మిక గురువులకు అమెరికా గుర్తింపు**

ప్రముఖ భారతీయ ఆధ్యాత్మిక గురువులు శ్రీశ్రీ రవిశంకర్, ఆచార్య లోకేశ్ ముని ప్రపంచ శాంతి, సామరస్యాల కోసం గొప్ప కృషి చేస్తున్నట్లు అమెరికన్ కాంగ్రెస్ ప్రశంసించింది. శ్రీశ్రీ రవిశంకర్, ఆచార్య లోకేశ్ ముని సేవలను భారతీయ సంతతి ప్రతినిధి రాజా కృష్ణమూర్తి కొనియాడారు.

## ఉజ్జయిని రేప్ కేసు నిందితుడికి బతికే హక్కు లేదు

### అతన్ని కాల్చిపారేయాలి: నిందితుడి తండ్రి రాజు సోని

భోపాల్: తన కుమారుడు ఇలాంటి పనిచేసాడన్నది నమ్మలేకపోతున్నానని, 12ఏండ్ల బాలికపై ఘాతుకానికి పాల్పడ్డ వాడికి బతికే హక్కు లేదని, నిందితుడికి మరణశిక్ష విధించాల్సిందేనని ఉజ్జయిని రేప్ కేసులో నిందితుడి తండ్రి రాజు సోని అన్నాడు. దేశం యావత్తు ఉలిక్కిపడిన ఈ ఘటనలో నిందితుడు ఆటో రిక్షా డ్రైవర్ భరత్ సోనిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నిందితుడి తండ్రి రాజు సోని శనివారం మీడియాతో మాట్లాడుతూ, 'అత్యంత హేయమైన దాడికి పాల్పడ్డవాడ్ని కఠినంగా శిక్షించాలి. వాడికి బతికే హక్కు లేదు. కాల్చిపారేయాలి. బాధితురాలి స్థానంలో నా కూతురున్నా ఇదే విషయం చెబుతాను' అని అన్నాడు. పోలీసులు వచ్చి భరత్‌ను అరెస్టు చేసే వరకు తనకు విషయం తెలియదన్నాడు. 'ఉజ్జయినిలో రేప్ జరిగిందన్న వార్త ప్రస్తావిస్తే, ఏమీ తెలియనట్టు వ్యవహరించాడు. భరత్ ఈ నేరం చేశాడంటే నమ్మలేకున్నా' అని వివరించాడు. మధ్యప్రదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న అత్యంత అమానుష లైంగిక దాడి ఘటన దేశ ప్రజల్ని తీవ్రంగా కలిచివేసింది. 12 ఏండ్ల బాలిక ఎంతోమందిని వేడుకున్నా, ఎవరూ ఆమెకు సాయం చేయడానికి ముందుకు రాకపోవటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.

# మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలం

- 74 మంది లింగాయత్ ఎమ్మెల్యేలున్నారు
- కాంగ్రెస్ పాలనలో లింగాయత్‌లకు అన్యాయం
- ప్రభుత్వ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదు
- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే శివశంకరప్ప

శివశంకరప్ప

బెంగళూరు, సెప్టెంబర్ 30: కర్ణాటక కాంగ్రెస్‌కు ఎన్నికల్లో గెలిచి సర్కార్‌ను నడుపుతున్నామన్న సంతృప్తి లేకుండా పోయింది. ఓవైపు ఆపరేషన్ కమలం అంటూ బీజేపీ బెదిరిస్తుండగా.. మరోవైపు పార్టీలో గ్రూపు తగాదాలు, వర్గ పోరు, సొంత పార్టీ నేతల అసమ్మతిరాగంతో కర్ణాటక కాంగ్రెస్ సతమతమవుతున్నది. ఏకంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సీఎం సిద్ధరామయ్యల మధ్య పొసగడం లేదు. వారిద్దరూ రెండు వర్గాలుగా విడిపోయారు. తాజాగా కాంగ్రెస్ పాలనలో లింగాయత్‌లకు అన్యాయం జరుగుతున్నదని ఆ సామాజికవర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యే శామనూర్ శివశంకరప్ప మరో వివాదానికి తెరలేపారు. 74 మంది లింగాయత్ ఎమ్మెల్యేలు ఉన్నారని, వేరే పార్టీలతో కలిసి తామే ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేసుకోగలమని సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వ పోస్టింగుల్లో లింగాయత్‌లకు అన్యాయం జరుగుతున్నది. ముఖ్యమైన పోస్టులు ఇవ్వకుండా పక్కన పెడుతున్నారు. రాష్ట్రంలో 74 మంది లింగాయత్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వేరే పార్టీలతో కలిసి మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలం. నేను ఎవరినీ చూసి భయపడను. ఈ విషయం గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాల్సిన అవసరం ఉంది. సీఎం సిద్ధరామయ్యతో మాట్లాడతా' అని ఆయన పేర్కొన్నారు. కాగా, సామాజికవర్గాల ఆధారంగా పోస్టింగులు ఇవ్వరని హోం మంత్రి పరమేశ్వర తెలిపారు.

# బీజేపీపై ధిక్కార స్వరం!

- ఇటు ప్రజల నుంచి.. అటు సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత
- వివిధ రాష్ట్రాల్లో తీవ్రమైన ప్రజాగ్రహం
- సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు
- మధ్యప్రదేశ్‌లో రాజీనామాల పర్వం
- ఇంత వ్యతిరేకతా: మణిపూర్ బీజేపీ చీఫ్

న్యూఢిల్లీ: ప్రజా సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీకి దేశవ్యాప్తంగా ఇంటాబయటా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటు ప్రజల నుంచి.. అటు సొంత పార్టీ నేతల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సొంత పార్టీ నేతలే విమర్శలతో విరుచుకుపడుతున్నారు. మధ్యప్రదేశ్‌లో ఎంపీలు, కేంద్రమంత్రులను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యేలు రాజీనామాలకు దిగారు. ప్రభుత్వం, పార్టీపై ఇంత భారీ స్థాయిలో వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదని మణిపూర్ బీజేపీ చీఫ్ సొంత పార్టీపైనే విమర్శలు గుప్పించారు. మరోవైపు యోగీ సర్కార్‌పై ఆ పార్టీ నేత వరుణ్‌గాంధీ విరుచుకుపడ్డారు. బీజేపీ అధికారంలో ఉన్న త్రిపురలో ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. దీంతో రానున్న ఐదు రాష్ట్రాలు, సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓటమి తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మధ్యప్రదేశ్‌లో వరుస రాజీనామాలు...**

మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండటంతో సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ నాయకత్వంలో ఎన్నికలకు వెళితే.. ఓటమి ఖాయమని ముందే తెలుసుకున్న ఆ పార్టీ ఏకంగా రాష్ట్ర సీఎంనే పక్కనపెట్టింది. కేంద్ర మంత్రులు, ఎంపీలను బరిలోకి దించాలని బీజేపీ ప్రణాళికలు రచించింది. అయితే ఈ ప్లాన్ కూడా బెడిసికొట్టింది. ఇప్పటివరకు తమకే సీట్లు ఇస్తారని భావించిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసమ్మతి స్వరం వినిపిస్తున్నారు. ఇప్పటికే పలువురు సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు సహా 40 మంది నేతలు బీజేపీకి గుడ్‌బై చెప్పారు.

**వరుణ్‌గాంధీ అసమ్మతి స్వరం...**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వంపై సొంత పార్టీ ఎంపీ వరుణ్‌గాంధీ విమర్శలు గుప్పించారు. ఒకరి పేరుపైన ఆగ్రహంతో లక్షలాదీ మంది కడుపు కొట్టవద్దని యోగీ సర్కార్‌ను దుయ్యబట్టారు. అమేథీలోని సంజయ్‌గాంధీ దవాఖాన లైసెన్స్ రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 'మానవత్వంతో మాత్రమే ఇబ్బందుల్లో ఉన్నవారికి న్యాయం జరుగుతుంది. దురహంకారంతో కాదు' అని పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరపకుండానే లైసెన్స్‌ను రద్దు చేశారని డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్‌కు ఆయన లేఖ రాశారు.

**గ్రేటర్ తిప్రాల్యాండ్ కావాలంటూ డిమాండ్**

బీజేపీ పాలిత త్రిపుర సర్కార్ ప్రజాగ్రహాన్ని ఎదుర్కొంటున్నది. గిరిజనుల ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రతిపక్ష తిప్రా మోతా ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహించారు. రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధం చేశారు.

### 'మణిపూర్‌లో మన ప్రభుత్వం విఫలం'

ఇంఫాల్: మణిపూర్‌లో హింసను అరికట్టడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సాక్ష్యాత్తూ మణిపూర్ బీజేపీ శాఖ ఈ వాస్తవాన్ని అంగీకరించింది. హింసను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, సర్కార్ పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొన్నదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ఉధృతమవుతున్నాయని మణిపూర్ బీజేపీ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు తాజాగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు లేఖ రాసింది. దీనిపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు ఏ శారదా దేవితో సహా ఎనిమిది మంది ఆఫీస్ బేరర్లు సంతకాలు చేశారు. మరోవైపు అధికార పార్టీపై ఈ స్థాయిలో ఆగ్రహం, ప్రజా వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదని మణిపూర్ బీజేపీ చీఫ్ శారదా దేవి పేర్కొన్నారు.

## 50 మెట్లు ఎక్కండి.. గుండెను కాపాడుకోండి!

న్యూఢిల్లీ: ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తెల్లారే లేచి అదే పనిగా నడుస్తూ చెమటోడ్చే వారికి శుభవార్త. ఇకపై ఇలా చేయాల్సిన పనిలేకుండానే గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. రోజుకు కనీసం 50 మెట్లు ఎక్కడాన్ని అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మీ చేతుల్లో ఉన్నట్టేనని అమెరికాలోని తులానే యూనివర్సిటీ తాజా అధ్యయనంలో వెల్లడైంది. రోజూ 50 మెట్లు ఎక్కగలిగితే గుండె జబ్బుల ముప్పు 20 శాతం తగ్గుతుందని అధ్యయనకారులు తేల్చారు. ఈ అధ్యయన వివరాలు అథెరోస్క్లెరోసిస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హై ఇంటెన్సిటీతో మెట్లు ఎక్కడం వల్ల కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్‌తోపాటు లిపిడ్ ప్రొఫైల్‌ను పెంచుకోవచ్చని అధ్యయనం పేర్కొంది.



## ప్రాణాంతక వ్యాధిని జయించిన ఆస్ట్రేలియన్ మహిళ

సిడ్నీ : శరీరంలోని మాంసాన్ని తినేస్తూ, ప్రాణాలు తీసే వ్యాధి నుంచి ఆస్ట్రేలియన్ మహిళ (48) కోలుకున్నారు. కాలేయం తదితర అవయవాలు పనిచేయకపోవడంతో ఆమెను సిడ్నీలోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ హాస్పిటల్‌కు తరలించారు. ఆమెకు క్లోస్ట్రిడియమ్ చౌవోయీ అనే బ్యాక్టీరియా సోకినట్లు వైద్యులు గుర్తించారు. జంతువుల్లో వచ్చే బ్లాక్ లెగ్ వ్యాధికి కారణం ఇదేనని గమనించారు. దీనికి ఏ విధంగా వైద్యం చేయాలో నిర్దిష్టంగా ఏమీ తెలియదు. శరీరంలోని మాంసాన్ని తినేసే బ్యాక్టీరియాగా దీనిని పిలవవచ్చు. ఈ బ్యాక్టీరియా రక్తంలోకి చేరి, దానిని విషపూరితం చేస్తుంది. గతంలో ఇటువంటి వ్యాధి సోకిన జపాన్, అమెరికాలకు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

## ఇంధనం అవసరం లేని సోలార్ ఎయిర్‌షిప్

న్యూయార్క్, సెప్టెంబర్ 30: అసలు ఇంధనం అన్నదే లేకుండా ప్రపంచాన్ని చుట్టేసే వాహనం ఉంటే ఎంత బాగుణ్ణు అన్న ఆలోచనను నిజం చేశారు యూరో శాస్త్రవేత్తలు. ఏ ఇంధనం అవసరం లేకుండానే సున్నా ఉద్గారాలతో పనిచేసే సోలార్ ఎయిర్‌షిప్‌ను తయారు చేశారు. ఇది భూమధ్యరేఖ చుట్టూ దాదాపు 40 వేల కిలోమీటర్లు కేవలం 20 రోజుల్లో సున్నా ఉద్గారాలతో చుట్టేసి వస్తుంది. 495 అడుగుల పొడవున్న ఈ ఎయిర్‌షిప్ ఉపరితలం మొత్తం సోలార్ ఫిల్మ్‌తో కప్పి ఉంటుంది. సోలార్ ఫిల్మ్ ద్వారా సూర్యరశ్మిని స్వీకరించి ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్స్ ద్వారా ఎయిర్‌షిప్ నడుస్తుంది. అలాగే పగలు తయారు చేసిన అదనపు విద్యుత్‌ను హైడ్రోజన్‌గా మార్చడంతో రాత్రిపూట కూడా దీని పయనానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదు. ముగ్గురు సిబ్బందితో నడిపే ఈ ఎయిర్‌షిప్ గంటకు 83 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడమే కాక ఒక కార్గో విమానం కంటే 8-10 రెట్ల సరుకును రవాణా చేయగలదు.

## అమెరికాకు ముంచుకొస్తున్న షట్‌డౌన్ ముప్పు

వాషింగ్టన్: అమెరికా దేశం మరోసారి ఆర్థిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోబోతున్నది. ఫెడరల్ ప్రభుత్వం ప్రవేశ